భూముల సర్వే పక్కాగా నిర్వహించాలి

కడప కార్పొరేషన్: లే అవుట్లలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే పక్కాగా నిర్వహించాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన 49వ డివిజన్‌లోని విజయదుర్గా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వీధి దీపాలను, కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. కొత్త ఇళ్లు నిర్మించేవారు ప్లాన్ అప్రూవల్స్ తీసుకున్నారా లేదా అని ఆరా తీశారు. నగరంలో ఉన్న ప్రభుత్వ భూములు, స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. డ్రైనేజీకి సంబంధించిన మ్యాపులను పరిశీలించి, ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే నోటీసులు ఇచ్చి తొలగించాలని ఆదేశించారు. రామరాజుపల్లె నుంచి ప్రతిరోజూ నీటి సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ప్రజలకు నీటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

'స్పందన' కార్యక్రమంలో భాగంగా సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 64 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగం–21, టౌన్‌ప్లానింగ్–16, తహసీల్దార్–6, పబ్లిక్ హెల్త్–7, యూపీఏ విభాగం–1, సచివాలయ విభాగం–2, ఏడీ, వికలాంగుల శాఖ–1, హౌసింగ్ శాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చింది. వీటిని సకాలంలో పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఎస్ఈ, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో భాగంగా అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

ప్రపంచ విప్లవకారుడు చే గువేరా



కడప వైఎస్ఆర్ సర్కిల్: చే గువేరా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు



కడప ఎడ్యుకేషన్: చే గువేరా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: ప్రపంచ విప్లవకారుడు చే గువేరా అని పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు గణేష్, సహాయ కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. చే గువేరా వర్ధంతిని సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కడపలోని యస్వీ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చే గువేరా ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, కడప నగర నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జున, రమణ, బాబు, వేంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

– కడప ఆర్ఎస్‌యూ కార్యాలయంలో చే గువేరా వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్ఎస్‌యూ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ విప్లవ భావజాలం నేటి యువతకు చే గువేరా ఓ యూత్ ఐకాన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నాయకులు హరి, కిరణ్, ప్రమోద్, కళ్యాణ్, శ్రీకాంత్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీల అమలు కోసం పోరాడుతాం

కడప వైఎస్ఆర్ సర్కిల్: చే గువేరా స్ఫూర్తితో విభజన హామీల అమలు కోసం పోరాడుదామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం చే గువేరా వర్ధంతి సందర్భంగా కడప ఐటిఐ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చే గువేరా పోరాటపటిమను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, కార్యదర్శి డీఎం ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై దాడిని పోరాటాల ద్వారా ఎదుర్కోవాలి

– రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప కోటిరెడ్డిసర్కిల్/ కడప రూరల్ : మీడియాపై జరుగుతున్న దాడిని రాజకీయ పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ జర్నలిస్ట్ , ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫెడరేషన్ , ఆంధ్రప్రదేశ్ బ్రాడా కాస్టింగ్ అసోసియేషన్ పిలుపుమేరకు కడప జిల్లా జర్నలిస్టుల ఫెడరేషన్ ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి రాజు అధ్యక్షతన జర్నలిస్టుల అక్రమ అరెస్టులపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని దాని జీవనాధారమైన భావ ప్రకటనా స్వేచ్ఛ, పౌర హక్కులు, ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కడం మోడీ పాలనలో కొత్తేమీ కాదన్నారు. ఢిల్లీ పోలీసులు జర్నలిస్టుల ఇళ్లపై దాడులు చేసి వారి ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, కెమెరాలను స్వాధీనం చేసుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లక్ష్మిరెడ్డి, అక్బర్, సి.పి.ఐ. జిల్లా కార్యదర్శి చంద్ర, స్వచ్ఛంద సేవ నాయకులు సలావుద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్వేష్, శివకుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

పేరుకే సీసీ రోడ్డు..



కడప కార్పొరేషన్: కడప నగరంలో డీసీసీ బ్యాంకు నుంచి రాజారెడ్డి వీధిలోకి ఉన్న వీధి అంతా గుంతలమయం అయింది. ఇక్కడ సిమెంటు రోడ్డు ఉన్నప్పటికీ అది చాలా కాలం క్రితం వేయడంతో పైపులైన్ల కోసం, డ్రైనేజీ, ఇతర అవసరాల కోసం తవ్వి అన్నీ గుంతలే ఏర్పడ్డాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినపుడు నీరంతా రోడ్డుపైనే రోజుల తరబడి నిల్వ ఉంటోంది. అధికారులు స్పందించి కనీసం ఈ గుంతలకు మరమ్మతులు చేస్తే ఉపశమనం కలుగుతుందని స్థానికులు కోరుతున్నారు.





సైబర్ సెక్యూరిటీపై కొత్త సాంకేతిక నైపుణ్యం అవసరం

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని వారి బారిన ఎంతోమంది నష్టపోతున్నారని దాని సంరక్షణకు సైబర్ సెక్యూరిటీ ఎంతో అవసరం అని కాంచీపురం ఐఐఐటి డీఎమ్ డాక్టర్ విజయ్‌కుమార్ కృష్ణస్వామి అన్నారు. సోమవారం కడప కేఎస్ఆర్ఎం కళాశాలలో ఈసీఈ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సైన్సు అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు , కేంద్ర ప్రభుత్వ సంస్థ న్యూఢిల్లీ సహకారంతో ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు స్మార్ట్ హైబ్రీడ్ పునరుత్పాదక శక్తి సాంకేతికతలు అనే అంశంపై కార్యశాల జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్‌కుమార్ మాట్లాడుతూ శక్తి సరఫరా సమతుల్యత ,విశ్వసనీయత మెరుగుపరచడానికి స్మార్ట్ గ్రిడ్లు అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి, కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రధానాచార్యులు వీఎస్ఎస్‌మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్‌తోపాటు ఈసీఈ విభాగాధిపతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌కుమార్‌కృష్ణస్వామి

మండల అభివృద్ధికి కృషి

వల్లూరు: అధికారులు, ప్రజా ప్రతినిధులందరం సమష్టిగా పని చేసి వల్లూరు మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన సోమవారం మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీవో జుబేదా మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారా వాటి నిరోధానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని అన్నారు.

మండలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మండల కార్యాలయాల ఆవరణలో జరిగే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న జగనన్నా సువ్వే మా నమ్మకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఎకరాకు సాగునీరు



కాలువలకు నీటిని విడుదల చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్న లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. అచ్చవెల్లి గ్రామ సమీపంలో సుమారు రూ.90లక్షల పాడా నిధులతో పులివెందుల బ్రాంచ్ కెనాల్ అధికారులు ఎర్రిపల్లె వంకపై ఆనకట్ట నిర్మించారు. ఈ ఆనకట్ట ద్వారా అచ్చవెల్లి, పుట్రాయునిపేట గ్రామాల్లోని 150 ఎకరాలకు కాలువల ద్వారా నీరు సరఫరా అవుతుందని ఆయన అన్నారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం అక్కడ గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలువలకు నీటిని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు విడుదల చేశారు. కాలువలకు నీరు విడుదల చేయడం ద్వారా బోర్లలో నీటిశాతం పెరిగి రైతులు పంటలు బాగా పండించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పీబీసీ ఈఈ రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, భూపాల్‌రెడ్డి, షరీఫ్, రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్చకుల సమస్యలపై వినతి

కడప కల్చరల్ : స్థానిక దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులుగా సేవలు అందిస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు విజయ్‌భట్టర్ తిరుమల–తిరుపతి దేవస్థానాల ప్రతినిధులను కోరారు. సోమవారం ఆయన అర్చకులతో కలిసి టీటీడీ పాలక మండలి సభ్యులు మాసీమ బాబు, యానాదయ్యలను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. అర్చకులు కృష్ణమోహన్, తివిక్రమ్ తదితరులు తమ సమస్యలను నేరుగా వారికి విన్నవించారు. ఇటీవల మరణించిన రిటైర్డ్ అర్చకులు మచ్చా శేషాచార్యుల కుమారుడికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ప్రధానంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకులకు వరంగా అందించిన అర్చకుల అనువంశిక వెసలుబాటును తమకు కూడా తప్పక వర్తించేలా చూడాలని కోరారు. నేడు జరగనున్న పాలక మండలి సభ్యుల సమావేశంలో ఈ అంశాలను తప్పక బోర్డు దృష్టికి తేగలమని సభ్యులు తెలిపారు.

30వ డివిజన్ సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని 30వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రా రెడ్డి, నగర కమిటీ సభ్యులు డి. ఎం. ఓబులేసు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 30వ డివిజన్ పరిధిలో సీపీఎం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 డివిజన్ పరిధిలో పాలెం పాపయ్య వీధి 4వ రోడ్ లో ఆరు నెలలుగా డ్రైనేజీ కాలువలలో పూడిక తీయలేదన్నారు. కొన్ని కాలువలను పూర్తిగా మట్టి తోటి నింపడం జరిగిందన్నారు. ఖాళీ స్థలాలలో మట్టి, చెత్తాచెదారాలతో నిండి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగర పాలక కమిషనర్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు షకీలా, లతిఫా, షఫీయా, వహీదా, ఉదయ్, మైనుదిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

జనరల్ బోగీలను పెంచాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం ఈమేరకు కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్‌కు ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ జనరల్ బోగీలు ప్రతి రైలుకు రెండు మాత్రమే ఉండటంతో పేద ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రయాణం చేయాలంటే వందే భారత్ రైలు టికెట్ ధరలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు బ్రహ్మం, నగర అధ్యక్షులు శివ నాగేంద్ర, నగర కార్యదర్శి మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

టైర్ల ఖర్చును తగ్గించాలి



మాట్లాడుతున్న ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : బస్సుల టైర్ల విషయంలో చేస్తున్న ఖర్చును తగ్గించాలని ఏపీఎస్ ఆర్టీసీ కడపజోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం కడప జోనల్ వర్క్‌షాప్‌లో టైర్ల సంరక్షణ పక్షోత్సవాల సందర్భంగా జోన్ పరిధిలోని 33 డిపోల టైర్ మెకానిక్‌లు, గ్యారేజ్ ఇన్‌ఛార్జిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు టైర్ల మన్నిక పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. బస్సు బయలుదేరే సమయానికి టైర్లను జాగ్రత్తగా పరిశీలించి మెకానిక్‌లచే అవసరమైన మరమ్మతులు చేయించుకోవాలన్నారు. అనంతరం టైర్ల సంరక్షణకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో జేకే టైర్ కంపెనీ సర్వీస్ ఇంజనీరు, వర్క్స్ మేనేజర్ అజ్మతుల్లా, డిప్యూటీ సీఎంఈ పి.లక్ష్మిభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీ



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కడప కల్చరల్ : కడప నగరం బిల్టప్ వద్దగల అజ్మత్ కల్యాణ మండపంలో సోమవారం కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మహా ప్రవక్త మహమ్మద్‌గురించి క్విజ్‌పోటీలను నిర్వహించారు. సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని మదరసా, పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించామన్నారు. తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ విభాగాల్లో బహుమతులను వేర్వేరుగా అందజేస్తామన్నారు. నగరంలోని జామియా తుస్సాలిహాత్ మదరసాతోపాటు ఉమ్మడి జిల్లాలోని 18 కేంద్రాల్లో ఈ పోటీలు నిర్వహించామని, మొత్తం మూడు వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

చర్చి ప్రహరీ నిర్మాణానికి తోడ్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్/కల్చరల్ : కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలోగల న్యూ నేటివ్ కృపా చర్చి ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు చర్చి ప్రహరీ నిర్మాణానికి తనవంతుగా తోడ్పాటు అందిస్తానని కడప మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య హామీ ఇచ్చారు. సోమవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కృపా కాలనీ సమస్యలను నగర మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకుపోయి త్వరలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అంతకుముందు పాస్టర్ మహేష్ స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ శాంతమ్మ, వైఎస్ఆర్ సీపీ నాయకులు గువ్వల మధుసూదన్ రావు, క్రిష్ణ, బుడగజంగం నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి వినతి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్య పరిష్కారానికి కృషిచేయాలని ఏపీ ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. శ్రీకాంత్‌రెడ్డి, డా. ఆర్. నీలయ్య కోరారు. సోమవారం వైవీయూలో వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి అధ్యాపకుల మూల్యాంకన వేతనాలను పెంచాల్సి ఉన్నప్పటికీ దాదాపు 6 సంవత్సరాలవుతున్నా పెంపుదల నోచుకోలేదన్నారు. మూల్యాంకనానికి సంబంధించి అధ్యాపకుల సీనియారిటీ జాబితాను రూపొందించాలని కోరారు. దసరాల సెలవులను ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు పొడిగించాలని కోరారు. జాతీయస్థాయి క్యాంపుల్లో పాల్గొనే ఎన్‌సీసీ కేడెట్స్‌కు హాజరులో మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆర్థిక కార్యదర్శి డా. పి. రామకృష్ణ పాల్గొన్నారు.

రూరల్ సీఐగా శంకర్ నాయక్

చింతకొమ్మదిన్నె : కడప రూరల్ సీఐగా శంకర్ నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పుట్టపర్తి నుంచి బదిలీపై ఇక్కడకు రాగా, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న గత సీఐ విజయ భాస్కర్ గౌడ్ బదిలీపై అనంతపురం వెళ్లారు. నూతన సీఐకు సీకేదిన్నె, పెండ్లిమర్రి, చెన్నూరు ఎస్ఐలు భూమా అరుణ్‌రెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డిలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా ఉపేక్షించేది లేదన్నారు.

ఆరోగ్య పరీక్షలు

వీరపునాయునిపల్లె: మండలంలోని యు.రాజుపాలెం సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి మహమ్మద్ తాహ తెలిపారు. తాటిమాకులపల్లె, కదిరేపల్లె, తంగెడుపల్లె, యు.రాజుపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జ్యోతి, లక్ష్మిప్రియ, హుస్సేన్ బాషా, జరీనా, వైద్య సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనాక్‌కు కడప విద్యార్థి



కడప విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టుతో జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డి, హెచ్ఎం మేరీ

కడప ఎడ్యుకేషన్: న్యూఢిల్లీ ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో జరుగుతున్న జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ ప్రతిభా ప్రదర్శనలో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ తరుపున వైఎస్సార్ జిల్లా కడప చెమ్మియాపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి ఫైజా సుల్తానా రూపొందించిన పెడల్ ఫ్రీ హ్యాండ్ ప్లూమ్ నమూనాను ప్రదర్శించింది. ఈ ప్రదర్శన 9, 10, 11 తేదీలలో జరుగుతుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి మొత్తం 441 ప్రాజెక్టులు ఈ ప్రదర్శనలో పోటీ పడుతున్నట్లు జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డి తెలిపారు. ఈ జాతీయస్థాయి ప్రదర్శనలో విద్యార్థినితోపాటు పాఠశాల గైడ్ టీచర్ సోఫియా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మేరీలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరం మాసాపేట వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా మాచుపల్లె బస్టాండు సర్కిల్‌లో ప్రపంచ మేధావి డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని జైభీమ్ మాల మహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, చైతన్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీకి వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంజే కుంట ఆలయం పక్కనున్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ మాల మహాసేన ఉపాధ్యక్షులు లావణ్య, శ్యాంసన్ పాల్గొన్నారు.

మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకోవాలి



మాట్లాడుతున్న ఫాతిమా మెడికల్ కళాశాల అధినేత జవ్వాద్ ఏక్యూ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి వైద్యుడిగా పేరు తెచ్చుకోవాలని ఫాతిమా మెడికల్ కళాశాల అధినేత జవ్వాద్ ఏక్యూ తెలిపారు. సోమవారం ఫాతిమా మెడికల్ కళాశాలలో 13వ బ్యాచ్ విద్యార్థులకు ఓరియంటేషన్ వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల నుంచి దాదాపు వెయ్యి మంది విద్యార్థులు వైద్యులుగా మారి సమాజానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఈ విధంగా 13వ బ్యాచ్ విద్యార్థులు కూడా భవిష్యత్తులో మంచి వైద్యులుగా మారి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ముర్తుజా, ప్రిన్సిపాల్ డాక్టర్ శేలారేఖ, డైరెక్టర్ డాక్టర్ జయరామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

సారాకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నాటుసారాకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం సికెదిన్నె మండలం గుర్రం గుంపు తండాలో ఎస్ఈబీ ఆధ్వర్యంలో పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాటు సారాయికి దూరంగా ఉండాలని, దాని వలన కలిగే దుష్పరిణామాలను గ్రామ ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఎక్కడైన బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరైనా నాటు సారా తయారు చేస్తే తమకు సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ జి విశ్వనాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతూ రీసోర్స్ పర్సన్ డా. జి.ఎల్.ఎన్. ప్రసాద్

వైవీయూ : మనం చేసే బోధన, పరిశోధన, పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు డా. జి.ఎల్.ఎన్. ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'పనిచేసే ప్రాంతంలో ప్రొడక్టివిటీ పెంపు ఎలా..?' అన్న అంశంపై ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పోటీప్రపంచంలో చేసే పనిలో క్వాలిటీతో పాటు క్వాంటిటీ కూడా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపుల ద్వారా అధ్యాపకుల్లో నూతన నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సి.వి. కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నరసింగుపల్లె వాసులు

కడప సెవెన్‌రోడ్స్ : పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని నరసింగుపల్లెలో స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ నాయకులు వారికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు 443లో 1.80 ఎకరాలను 1981లో ప్రభుత్వం స్మశాన వాటికకు కేటాయించిందన్నారు. అప్పటి నుంచి ఎవరైనా మృతి చెందితే అక్కడ అంత్యక్రియలు చేసుకునేవారన్నారు. అయితే మూడేళ్ల కిందట తమ గ్రామానికి చెందిన జక్కల బాలకృష్ణ అనే వీఆర్వో ఆ భూమి తన తల్లి పేరిట ఉందని ప్రజలను ఆక్షేపిస్తున్నారని తెలిపారు. తక్షణమే ఆయనపై చర్యలు తీసుకుని స్మశాన వాటికకు కంచె ఏర్పాటు చేయాలని కోరుతూ పలుమార్లు రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నాయకులు వీరశేఖర్ పాల్గొన్నారు.